

సాక్షి ఒడిశా
శుక్రవారం । 31 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,11,459లు, బంగారం 1.55గ్రాములు, వెండి 12గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



అంతా.. రామమయం

- 8లో



మహావిశుభ ఉత్సవాలకు ముహూర్తపు రాట

- 8లో

న్యూస్‌రీల్

ఓంఫెడ్ పాల ధర పెంపు

● ఏప్రిల్ 1 నుంచి అమలు



ఓంఫెడ్ పాల ప్యాకెట్లు

భువనేశ్వర్: వినియోగదారులకు స్వల్ప భారం మోపింది. ఒడిశా స్టేట్ కో–ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్(ఓంఫెడ్) విక్రయిస్తున్న పాల ధర పెంచింది. కొత్త ధరలు ఏప్రిల్ 1నుంచి అమలవుతాయని ఈ సంస్థ ప్రకటించింది. కొత్త ధరల ప్రకారం అన్ని రకాల ఓంఫెడ్ 500 మిల్లీలీటర్ల ప్యాకెట్ రూ.2 చొప్పున పెంచినట్లు పేర్కొన్నారు. అర లీటర్ ఓంఫెడ్ టోన్డ్ మిల్క్ ప్యాకెట్ ధర రూ.21 నుంచి రూ.23కి, ప్రీమియం మిల్క్ ధర రూ.24 నుంచి రూ.26కి, గోల్డ్ మిల్క్ ధర రూ.24 నుంచి 26కి, చాయ్ స్పెషల్ మిల్క్ ధర రూ.23 నుంచి రూ.25 వరకు పెరిగింది. పాల ఉత్పత్తికి సంబంధించిన వివిధ పదార్థాలు, సరఫరాల ధరల పెరుగుదల కారణంగా పాల ధర పెంచడం అనివార్యమైనట్లు ఓంఫెడ్ అధికారులు తెలియజేశారు. వీటిలో విద్యుత్ టారిఫ్, ప్యాకేజింగ్, రవాణా, పశుగ్రాసం ఉన్నట్లు వివరించారు. పాల విక్రయాల ఆదాయంలో 90శాతం పాల సేకరణకే ఖర్చు అవుతోందన్నారు. బాధ్యతాయుతమైన సంస్థగా, పాల ఉత్పత్తిదారులకు సరసమైన ధరలు కేటాయించి నిరంతర పాల ఉత్పాదనతో వినియోగదారులకు నాణ్యమైన పాలను సరసమైన ధరలకు అందేలా చేసే లక్ష్యానికి ఓంఫెడ్ కట్టుబడి ఉందని స్పష్టంచేశారు.

30 నిమిషాల్లో 5వేల పిడుగులు!

● వివిధ ప్రాంతాల్లో ఐదుగురు మృతి

భువనేశ్వర్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం భీకర వైపరీత్యం చోటు చేసుకుంది. కేవలం 30 నిముషాలు(అరగంట) వ్యవధిలో 5,000కు పైగా పిడుగులు పడ్డాయి. ఈ వైపరీత్య ఘటనతో భద్రక్ జిల్లా బాసుదేవ్‌పూర్ ప్రాంతంలో సంభవించిందని భువనేశ్వర్ లోని వాతావరణ కేంద్రానికి చెందిన నిపుణులు ఉమాశంకర్ దాస్ సోషల్ మీడియాలో ప్రసారం చేశారు. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ పిడుగుల తీవ్రత అత్యంత భయంకరంగా నమోదైనట్లు పేర్కొన్నారు.

కలప అక్రమ రవాణకు అడ్డుకట్ట



కలపతో సహా అధికారులకు పట్టుబడిన వ్యాన్

బరంపురం: మొక్కలు నాటి పచ్చదనం, ప్రకతిని కాపాడుకుందామని ఒకవైపు అధికారులు ప్రజలను చైతన్యవంతం చేస్తుంటే.. మరోవైపు గంజాం జిల్లాలో అటవీ సంపదను నరికి, అక్రమంగా దోచుకుంటున్న ఘటనలు కొనసాగుతున్నాయి. ఐఐసీ అభిమన్య నాయక్ తెలిపిన వివరాల ప్రకారం నగర శివారు గొళంతరా పోలీసు స్టేషన్ పరిధి టమనా అటవీ ప్రాంతం వ్యాన్‌లో అక్రమంగా కలప తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు అటవీశాఖ అధికారుల సాయంతో దాడులు చేయగా, రూ.లక్షల విలువైన భారీ కలప దుంగలు పట్టుబడ్డాయి. అయితే నిందితులు వాహనాన్ని వదిలి, పరారవ్వడంతో ఎవరినీ అరెస్ట్ చేయలేదని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


అవినీతిపై చర్యలకు డిమాండ్

పర్లాకిమిడి: స్థానిక పురపాలక సంఘంలో జనన, మరణాల ధ్రువపత్రాల మంజూరుకు దరఖాస్తు చేసుకునే వారి నుంచి గుమస్తాగా పనిచేస్తున్న శ్రావణ్ అనే వ్యక్తి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు పట్టణంలోని ఓంశాంతి కాలనీకి చెందిన వ్యక్తులు ఆరోపించారు. బాధితులు గురువారం మాట్లాడుతూ.. దీనిపై స్థానిక విజిలెన్స్ డీఎస్పీ, సీడీఎంఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. పురపాలక సంఘం ఈఓ తగు చర్యలు తీసుకోకుంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని స్పష్టంచేశారు. ట్రేడ్ యూనియన్ నాయకులు సునీల్ పట్నాయక్, ఈశ్వరచంద్ర బెహరా, అల్లాన రోజారాణి, పైల మురళీకృష్ణ, ఎం .సుజాత తదితరులు పాల్గొన్నారు.

చైత్రోత్సవం.. చూతమురారండి..

ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం రాయగడ మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాలు ఏప్రిల్ 1నుంచి ప్రారంభం కానున్నాయి. 5రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు ఒడిశాతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో మందిరం కమిటీ సభ్యులు సందర్శకుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అధికార, పోలీసు యంత్రాగం భద్రతా చర్యలు చేపడున్నారు. – రాయగడ

- ఏప్రిల్ 1నుంచి రాయగడ మజ్జిగౌరి చైత్రోత్సవాలు
- నేటి సాయంత్రం నదీజలం సేకరణతో సంప్రదాయంగా శ్రీకారం
- 5రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాట్లు
- తరలిరానున్న సరిహద్దు రాష్ట్రాల భక్తులు



పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారు



అమ్మవారి మందిరం ప్రవేశ ద్వారం

ఏటా చైత్రమాసంలో ఘనంగా నిర్వహించే రాయగడ మజ్జిగౌరమ్మ ఉత్సవాలు ఏప్రిల్ 1నుంచి 5రోజుల పాటు జరగనున్నాయి. కరోనా కారణంగా గత మూడేళ్లు అమ్మవారి జాతర నిర్వహించక పోవడంతో ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు మందిర కమిటీ సభ్యులు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు ఈనెల 31న(శుక్రవారం) సాయంత్రం ఆలయానికి సమీపంలోని జంఝావతి నదీ నుంచి శుద్ధ జలాలను తీసుకువచ్చి, మందిరంలో నిలుపుతారు. దీంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్లుగా భావిస్తారు. శనివారం ఉదయం నుంచి సూర్యపూజలు, హోమం, చండీ హోమం, షోడసోపచార పూజలు, ఉత్సవాల ఆఖరి రోజు పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టనున్నారు. కార్యక్రమాలను నిర్వహించేందుకు గంజాం జిల్లా కవిసూర్యనగర్‌కు చెందిన పురోహితుల బృందం సన్నద్ధమవుతోంది.

ఉత్సవాలకు రూ.7 లక్షలు

5రోజుల పాటు జరగనున్న ఉత్సవాల నిర్వహణ కోసం మందిర కమిటీ ఈ ఏడాది రూ.7 లక్షలను కేటాయించింది. గతంలో కంటే ఈ ఏడాది ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మందిరంతో పాటు పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మరిన్ని పనులు..

అమ్మవారి మందిరం పరిసర ప్రాంతమంతా రైల్వే విభాగానికి చెందిన స్థలం కావడంతో దేవదాయ శాఖ అభివృద్ధి పనుల కోసం ఎటువంటి నిధులు కేటాయించలేదు. అయితే కొద్దిరోజుల క్రితం రైల్వేవిభాగం ఈ స్థలాన్ని మందిర అభివృద్ధి నిమిత్తం ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతో మాస్టర్‌ప్లాన్ రూపొందించి, మందిరం ప్రాంగణంలోని సుమారు 6ఎకరాల సువిశాల ప్రాంతంలో భక్తుల సౌకర్యార్థం వసతి గృహాలు, క్యూలైన్, షాపింగ్ కాంప్లెక్స్, సౌచాలయం తదితర అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నిత్యం వేలాది మంది భక్తులు వస్తుండటంతో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మందిరం కమిటీ తెలిపింది.

స్థల చరిత్ర..

16వ శతాబ్దంలో సూర్య వంశానికి చెందిన నందపూర్ మహారాజు విశ్వనాథ్‌దేవ్ గజపతి పరిపాలిస్తున్న కాలంలో రాయగడలో తన సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు సంకల్పిస్తాడు. దీంతో పరివారంతో కలసి ఇక్కడకు వచ్చి కోటను నిర్మిస్తాడు. సూర్య వంశీయుల కులదైవంగా పూజలందుకునే మజ్జిగౌరిని విశ్వనాథ్‌దేవ్ నాలుగు గోడల మధ్య నిలిపి పూజిస్తారు. 4గోడల మధ్య పూజలందుకోవడంతో అమ్మవారిని ఒడియాలొ మొయిు ఘొరియాణిగా కొలుస్తారు.

కాంట్రాక్టర్‌కు కలలో కనిపించి..

ప్రస్తుతం మజ్జిగౌరి మందిరానికి సంబంధించి స్థానికంగా ఒక కథ ప్రచారంలో ఉంది. బ్రిటీష్ పాలనలో భాగంగా విశాఖపట్నం నుంచి రాయిపూర్ వరకు రైలు మార్గం నిర్మాణంలో భాగంగా రాయగడ లోని జంఝావతి, నాగావళి నదులపై వంతెనను నిర్మించేందుకు సంకల్పించారు. కాంట్రాక్టర్ ఎన్నిసార్లు పనులు చేసినా.. వంతెన కూలిపోయేది. ఒకరోజు కాంట్రాక్టర్ కలలో కనిపించిన అమ్మవారు.. 'నేను ఈ సమీపంలోనే ఉన్నాను. నాకు గుడి కట్టి, పూజలు చేస్తే నీవంతెన నిలుస్తుంద'ని తెలిపారు. మరుసటి రోజు ఉదయం జంఝావతి నదీ పరిసరాల్లో గాలించిన కాంట్రాక్టర్‌కు తలతో కూడిన విగ్రహం మాత్రమే కనిపించింది. అక్కడే మందిరం నిర్మించి, పూజలు చేపట్టడంతో వంతెన నిలిచి, పనులు పూర్తయ్యాయి. ఇప్పటికీ ఈ వంతెన అమ్మవారి మందిరానికి సమీపంలో ఉంది.



మందిరం ప్రాగణంలో భక్తుల సందడి



చరిత్రతో ముడిపడి ఉన్న రైల్వే వంతెన

సతీ కుండం..



విశ్వనాథ్‌దేవ్‌కు వందమంది రాణులు ఉన్నట్లు నందపూర్ చరిత్ర తెలియజేస్తోంది. ఒక సమయంలో జరిగిన యుద్ధంలో రాజు మరణించడంతో రాణులంతా ఒకేసారి సతీసహగమనం చేస్తారు. దీనినే సతీ కుండంగా పిలుస్తారు. ప్రస్తుతం ఇది అమ్మవారి మందిరం వెనుక ఉంది. ప్రస్తుత మందిరం కమిటీ దీని పరిరక్షణ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా భక్తులకు చరిత్ర తెలియజేసేలా అభివృద్ధి పనులు చేపట్టారు. యుద్ధంలో మరణించిన విశ్వనాథదేవ్ తదనంతరం అమ్మవారికి నిత్యపూజలు కరువయ్యాయి. ఉన్న మందిరం శిథిలావస్థకు చేరుకోవడం రానురాను కనుమరుగయ్యాయి.

శాంతి స్వరూపిణి..



నిత్యం ఆలయంలో మధ్యాహ్నం అన్న భోగంతో పాటు ఉదయం, సాయంత్రం హారతి కార్యక్రమాలు నిర్వహిస్తాం. అమ్మవారికి మంగళవారం ప్రీతికరమైన రోజు కావడంతో గోధుమనూకతో తయారు చేసిన కక్కరాలు, పాయసం, కూరగాయలతో అన్నభోగంలో సమర్పిస్తాం. చైత్రోత్సవాల సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటాం. ఉత్సవాల ఆఖరి రోజు పూజారులంతా ఉపవాసాలతో అమ్మవారిని కొలుస్తాం. సాయంత్రం నిప్పులపై నడవడం, ముళ్లతో తయారు చేసిన ఊయలలో కూర్చోవడం తదితర కార్యక్రమాలు చేపడతాం. ఈ ఘటనలు అమ్మవారి నిదర్శనానికి ప్రతీకలుగా నిలుస్తాయి. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు కూడా వేల సంఖ్యలో హాజరవుతుంటారు.

– చంద్రశేఖర్ బెరుకో, అమ్మవారి సేవకుడు

రూ.1.38 కోట్లతో అభివృద్ధి..




అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న మజ్జిగౌరి మందిరంలో భక్తుల సౌకర్యార్థం రూ.1.38 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. అమ్మవారి ఖ్యాతి ఇనుమడించేలా ఆంధ్రప్రదేశ్ నుంచి రోడ్డు మార్గంలో వచ్చే భక్తులకు ఆహ్వానం పలికేలా స్వాగత ద్వారం ఏర్పాటు చేశాం. మరో మూడు ప్రధాన ప్రాంతాల్లో ఈ ద్వారాలను నిర్మించాం. స్థానిక జగన్నాథ మందిరం సమీపంలోని అమ్మవారి పంత్ నివాస అభివృద్ధి పనులు, మందిరం ప్రాంగణంలోని సతీ కుండం, యాత్రికుల నివాస్ అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

– రాయిసింగి బిడిక, మందిరం మేనేజింగ్ ట్రస్టీ

మండుటెండలో దొండొనాచొ పూజలు



భక్తిశ్రద్ధలతో దొండొనాచో దీక్షలు చేస్తున్న దీక్షాధారులు



మధ్యాహ్నం ఎండలో దీక్షాధారుల విన్యాసాలు

బరంపురం: గంజాం జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొండొనాచొ దీక్షలు వైభవంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ 14న మేరు సంక్రాతితో పూర్తయ్యే ఈ దీక్షలు ముగింపు సమీపిస్తున్న నేపథ్యంలో కఠోర దీక్షలు సాగుతున్నాయి. నగరంలోని పలు వీధుల్లో సంఘాల ఆధ్వర్యంలో దొండొనాచొ నిర్వహిస్తున్నారు. మిట్ట మధ్యాహ్నం మొదలైన పూజలు రాత్రికి దొండొకాళి పూజలు జరిపిన అనంతరం సంప్రదాయ నాటక ప్రదర్శనలు తెల్లవారి వరకు జరుగుతున్నాయి. ఈ ఏడాది గంజాం జిల్లాలో 2వేల దొండొనాచొ పుంజీలు(గ్రూప్‌లు)లో దాదాపు 5వేల మంది దీక్షలు పాటిస్తున్నారు.

'కాంట్రాక్టు సేవలు రద్దు చేయాలి'

పర్లాకిమిడి: ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రథమ సమ్మేళనాన్ని పట్టణంలోని టౌను హాలులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఉపాధ్యక్షుడు బీకే పటేల్ యూనియన్ జెండా ఎగురవేసి, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రామిక వర్గాలపై ఆక్రమణలు, ప్రైవేటీకరణ, కాంట్రాక్టు, పొరుగు సేవలను పూర్తిగా రూపుమాపాలని బాలచంద్ర షడంగి డిమాండ్ చేశారు. శ్రామికులు, శ్రమజీవుల కోసం ట్రేడ్ యూనియన్ పోరాటం చేస్తోందని తెలిపారు. అలాగే హక్కుల సాధనకు ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి పట్టణంలో జాతీయ ట్రేడ్ యూనియన్ మహాసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే సంఘం నూతన కార్యవర్గంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రతాప్ ప్రధాన్, సాధారణ కార్యదర్శిగా అగేంద్ర నాయక్, కోశాధికారిగా ప్రశాంత పరిచ్చా, కార్యదర్శిగా ఉత్తమ్ నాయక్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హైకోర్టులో ఉచిత వైఫై

● బార్ అసోసియేషన్ సభ్యుల సౌకర్యార్థం ఏర్పాటు



ఉచిత వైఫై, ఈఇన్‌స్పెక్షన్ ప్రారంభోత్సవంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మురళీధర్, ఇతర న్యాయమూర్తులు

భువనేశ్వర్: హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుల సౌకర్యానికి ఉచిత వైఫై సౌకర్యం, ఈ–ఇన్‌స్పెక్షన్ సదుపాయాన్ని ఒడిశా హైకోర్టు న్యాయమూర్తుల సమక్షంలో ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ ఎస్. మురళీధర్ ప్రారంభించారు. ఒడిశా అడ్వకేట్ జనరల్, హైకోర్టు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా, బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సాంకేతికత సాయంతో ప్రజలకు సత్వర, నాణ్యమైన న్యాయాన్ని అందించేందుకు రాష్ట్ర హైకోర్టు యత్నిస్తోంది. రికార్డుల డిజిటలైజేషన్, ఈ–ఫైలింగ్, కోర్టు ఫీజుల ఈ–చెల్లింపు, కాగితరహిత కోర్టులు, బార్ అసోసియేషన్‌కోసం ఈ–లైబ్రరీలు, వర్చువల్ కోర్టులు, హైకోర్టు మొబైల్ యాప్ హైకోర్టు చేపట్టిన కీలక ఈ కార్యక్రమాలు. తాజాగా బార్ సభ్యుల ప్రయోజనం కోసం ఉచిత వైఫై, ఈ–ఇన్‌స్పెక్షన్ సౌకర్యంతో ముందుకు రావడం విశేషం.

100 ఎంబీపీఎస్ వేగంతో..

బార్ సభ్యులకు ఉచిత వె-ఫై సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి 100 ఎంబీపీఎస్ వేగంతో ప్రత్యేక ఇంటర్నెట్ లీజు లైతో యాక్సెస్ పాయింట్లను హైకోర్టు ప్రాంగణం అంతటా బార్ అసోసియేషన్ మందిరంతో సహా బహుళ వినియోగదారులకు అంతరాయం లేకుండా ఉపయోగించేందుకు అమర్చారు. బార్ సభ్యులు సెల్‌ఫోన్లలో న్యాయవాది ఎస్‌ఎస్‌ఐడీతో ఈ సదుపాయాన్ని పొందేందుకు వీలు కల్పించారు. ఇంటర్నెట్‌ను పొందేందుకు కేటాయించిన ప్రత్యేక పాస్‌వర్డ్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది. జస్టిస్ డెలివరీ సిస్టమ్‌కు అంకితమైన వెబ్‌సైట్‌లు వైఫై సౌకర్యం ద్వారా మాత్రమే వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. వీటిలో భారత సుప్రీంకోర్టు వెబ్‌సైట్, ఒడిశా హైకోర్టు వెబ్‌సైట్, అధికారిక జిల్లా కోర్టు వెబ్‌సైట్‌లు, ఈ–ఫైలింగ్ పోర్టల్, ఈ–చెల్లింపు వెబ్‌సైట్, జూమ్ వెబ్‌సైట్, ఈ–కోర్టుల పోర్టల్, ఓహెచ్‌సీ ఈ–సర్వీసెస్, వర్చువల్ కోర్ట్ పోర్టల్, ఎన్‌జెడీజీ పోర్టల్, సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా, ఈ–ఎస్‌సీఆర్ తీర్పుల పోర్టల్ ఇతరేతర ఆమోదించబడిన వెబ్‌సైట్‌లు లభ్యం అవుతాయి. బార్ సభ్యులకు రికార్డుల పరిశీలన కోసం ఈ -ఇన్‌స్పెక్షన్ సౌకర్యం ప్రారంభించబడింది. డిజిటలైజేషన్ తర్వాత, రికార్డులు సాఫ్ట్ కాపీలలో అందుబాటులో ఉన్నాయి. ఈ–తనిఖీ సౌకర్యం ద్వారా బార్ సభ్యులు తనిఖీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలవుతుంది. రికార్డు కోసం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా నిమిషాల్లోనే ప్రత్యేక కంప్యూటర్ సిస్టమ్‌లో రికార్డ్ సాఫ్ట్‌కాపీ లభ్యం అవుతుంది.

● నవమి.. నమామి



కటక్ ఖపురియా కలప మిల్లులో కలప దుంగలకు పూజలు చేస్తున్న దృశ్యం

- పూరీ జగన్నాథుని సన్నిధిలో శ్రీరామ జన్మదిన ఉత్సవం
- రథాల తయారీకి కలప చీలికకు శ్రీకారం

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని సన్నిధిలో గురువారం శ్రీరామ జన్మోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏటా రామ నవమి పురస్కరించుకుని శ్రీమందిరం భిత్తొరొ కతొ ప్రాంగణంలో రామ జన్మదిన ఉత్సవం చేపట్టారు. ఈ ముంగిటలో పంచవర్ణాలతో శ్రీరామ జన్మకుండలి రంగరించి, పూజాదులు నిర్వహించడం విశేషం. రత్న వేదికపై కొలువుదీరిన జగన్నాథుని నుంచి ఆజ్ఞామాల ఆగమనంతో ఈ ఉత్సవాలు ప్రారంభించడం సంప్రదాయం. ఈ సందర్భంగా గురువారం మధ్యాహ్నం 3గంటల నుంచి దాదాపు 5గంటల సమయం సాధారణ భక్తులకు ప్రవేశం నివారించారు. రామనవమి ఉత్సవ సంప్రదాయ పూజాదులు ముగిసిన అనంతరం భక్తులు, యాత్రికులకు ఆలయం లోపలికి ప్రవేశించేందుకు అనుమతించారు. ఈ ఏడాది జూన్ 20న విశ్వవిఖ్యాత జగన్నాథుని రథయాత్ర జరగనుంది. ఈ నేపథ్యంలో నవమి పురస్కరించుకుని ఈ ప్రక్రియ కటక్ ఖపురియా కలప మిల్లులో నిర్వహించారు. శ్రీమందిరం పాలకవర్గం నుంచి ఐదుగురు సభ్యుల ప్రతినిధి బృందం మాలాదులతో బయలు దేరింది.

చేరుకున్న ఆజ్ఞమాల..

ఈ ఏడాది ఏప్రిల్ 23న అక్షయ తృతీయ పురస్కరించుకుని రథ నిర్మాణం ప్రారంభిస్తారు. ఆలయ కార్యాలయంలో సరస్వతీ పూజ నుంచి పూజించిన మూడు ధౌర కలప చెక్కలను ఆలయ అర్చకులు హోమంలో పూర్ణాహుతి చేస్తారు. మణిభూషిత పల్లకిపై మదనమోహన్, భూదేవి, శ్రీదేవి, రామకృష్ణ సమేతంగా ఈ ప్రాంగణానికి స్వామివారు చేరుకోవడం సంప్రదాయం. ఆలయం నుంచి తీసుకొచ్చిన జగన్నాథునికి సమర్పించిన పూలమాలలు 3రథాల కోసం సంకల్పించిన 3చెక్కలకు సమర్పించి పూజా పండా వర్గీయులు పూజాదికాలు నిర్వహించారు. రథాల తయారీలో వినియోగించే కలపను లాంఛనంగా చీల్చుతారు. ఈ ప్రక్రియను 3 రథాల ప్రధాన వడ్రంగులు ప్రారంభిస్తారు. ప్రత్యేక ప్రతినిధి బృందం కటక్ ఖపురియా కలప మిల్లుకు గురువారం బయల్దేరింది. శ్రీమందిరం పాలనాధికారి జితేంద్ర దాస్, రథాల అమీన్ లక్ష్మణ్ మహాపాత్రొ, భొయి సర్దార్ రవి భొయి, సుదర్శన్ మేకప్ ఈ బృందంలో ఉన్నారు.



ప్రారంభమైన రథాల ప్రధాన కలప దుంగల చీలిక



జగన్నాథుని ఆజ్ఞామాలతో పూరీ నుంచి బయల్దేరిన పాలకవర్గం ప్రతినిధి బృందం

క్లుప్తంగా

9న అమరావతి జేఏసీ సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: విజయవాడలోని రెవెన్యూ భవన్ వేదికగా ఏప్రిల్ 9న జరగనున్న అమరావతి జేఏసీ సమావేశానికి భాషాపండితులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరు కావాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పిసిని వసంతరావు, కూన రంగనాయకులు కోరారు. ఈ సమావేశంలో డీఈఓ పూల్‌లో మిగిలిన తెలుగు,హిందీ, ఒడియా కన్నడం, సంస్కృతం భాషా పండితులు సుమారుగా 1361 మంది రాష్ట్రవ్యాప్తంగా ఎదుర్కొంటున్న పలు సమ స్యల పరిష్కారానికి కీలక తీర్మానాలు చేయనున్నా రని తెలిపారు. జిల్లాలో డీఈవో పూల్ భాషా పండితులతో సహా భాషోపాధ్యాయులంతా పెద్దఎత్తున హాజరు కావాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గార: మండలంలోని నిజామాబాద్ గ్రామం వద్ద సీఎస్పీ రోడ్డులో గురువారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం శ్రీకూర్మం కోవెలవీధికి చెందిన కోరాడ రాధాకృష్ణ (57) తన కుమార్తె కోరాడ సునీత (తోనంగి వీఆర్‌ఓ), మనవడితో కలసి గురువారం సాయంత్రం బైక్‌పై గార నుంచి శ్రీకూర్మం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో నిజామాబాద్ గ్రా మానికి భైరి లచ్చయ్య నడుచుకుంటూ వస్తుండగా బైక్ ఆయనకు తగిలి అంతా కింద పడిపోయారు. రాధాకృష్ణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కుమార్తె, మనవడికి స్వల్పంగా గాయాలయ్యాయి. భైరి లచ్చయ్యకు కూడా స్వలంగా గాయాలయ్యాయి.

పరుగు పెట్టించిన 'కరి' గుంపు



తోటలకు తిరుగుముఖం పడుతున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని పక్కుడుభద్ర జీడితోటల్లో మకాం వేసిన ఆరు ఏనుగుల గుంపు జీడి రైతులను పరుగులు పెట్టించాయి. తోటల్లోని జీడి పంటను ఏరడానికి వెళ్తున్న తమను బెదిరిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం పక్కుడుభద్ర తోటల్లోని ఏనుగుల గుంపును తరలించడానికి గిరిజనులు, తోట యాజమానులు చేసిన ప్రయత్నం విఫలమైంది. తోటల నుంచి బొమ్మిక మీదుగా ఏబీ రోడ్డు వరకు గిరిజన రైతులు ఏనుగులను వెంటబెట్టారు. పల్లపు ప్రాంతాలకు రాగానే ఏనుగుల గుంపు ఒక్కసారిగా రైతుల మీదకు తిరగబడినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. దీంతో రైతుల ప్రయత్నాలు బెడిసికొట్టాయి. తరువాత ఏనుగులు గుంపు యథాస్థానమైన జీడితోటలకు చేరుకున్నాయి. ఈ ఏనుగుల గుంపు ప్రవర్తన వేరేగా ఉందని, ఎలిఫెంట్ ట్రాకర్లు అభిప్రాయపడుతున్నారు.

నాగావళిలో యువకుడి గల్లంతు



గల్లంతైన కార్తీక్ (ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరుకు చెందిన యువకుడు అన్ను కార్తీక్(17) గురువారం నాగావళి నదిలో గల్లంగయ్యాడు. ఈ సంఘటనపై స్థానిక ఏఎస్సై రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కార్తీక్ మేతకోసం పశువులను నదివైపు తోలుకుని వెళ్లాడు. రెండు ఆవులు నది దాటి ఆవలవైపు వెళ్లిపోవడంతో వాటిని తెచ్చేందుకు నదిలోకి దిగగా పై నుంచి నీటి ప్రవాహంతో పాటు గోతులు ఉండడంతో గల్లంతయ్యాడు. యువకుడిని రక్షించేందుకు గజ ఈతగాళ్లు గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు తండ్రి వెంకట్, తల్లి అనూషలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఫిర్యాదు మేరకు యువకుడి గల్లంతుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అంతా.. రామమయం

రాష్ట్రవ్యాప్తంగా శ్రీరామ నవమి ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. పల్లెలు, పట్టణాలు అనే వ్యత్యాసం లేకుండా వాడవాడలా వేడుకలు మిన్నంటాయి. చిన్నారులు, పెద్దలు కోదండరాముని కొలిచి, భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. శోభయాత్రలో సీతారాముల విగ్రహాలను ఊరేగించి, భక్తిభావంతో ఉప్పొంగారు.

– సాక్షి నెట్‌వర్క్

- ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు
- పల్లెలు, పట్టణాల్లో ఆకట్టుకున్న శోభాయాత్ర

బరంపురం:

నగరంలోని ఆకుల, కాపు, బీరక, గొల్లపల్లి వీధులు, రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆలయంలో రామనవమి వేడుకలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు జంక్షన్లలో భక్తులకు చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, పానకాలు పంచిపెట్టారు. బరంపురంలోని బెజ్జిపూర్ నీలకంఠ నగర్‌కు చెందిన సైకతశిల్పి సత్యనారాయణ మహరాణ తన కళా నైపుణ్యంతో చేసిన శ్రీరాముని సైకతశిల్పం ఆకట్టుకుంది.

జయపురం: గత వందేళ్లుగా నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్న జమాల్ వీధిలోని సీతారామాంజనేయ మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సీతారామ, లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను తిరువీధులలో ఊరేగించారు. పూజా కమిటీ అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బరంపురం: ఆకుల వీధిలోని ఆలయంలో బారులు తీరిన భక్తులు

అలాగే రఘునాథ్ మందిరం, ఎంజీ రోడ్డు కెల్లా మిల్లు ప్రాంతంలో ఉన్న షిర్డీసాయి మందిరంలో నవమి ఉత్సవాలు చేపట్టారు. జయపురం హిందూ సమాజ్ నిర్వహించిన ర్యాలీలో మాజీమంత్రి రబి నారాయణ నందో, బీజేడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయగడ: పట్టణానికి చెందిన యువకులు, మహిళలు తొలిసారిగా శోభాయాత్ర నిర్వహించారు. బ్రహ్మణ వీధి సమీపంలోని కోదండరామ ఆలయంలో ప్రధానార్చకులు అనంత ఆచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో భాస్కరాచార్యుల నేతృత్వంలో తెలుగు బ్రహ్మణ సమాజం శ్రీరామ కల్యాణోత్సవం నిర్వహించారు. బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ, భళ్లమూడి నాగరాజు పాల్గొన్నారు. డైలీ మార్కెట్‌లోని అభయాంజనేయ మందిరంలో అన్నదానం చేపట్టారు.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని భైరవ మందిరం నుంచి రామభక్తులు 300 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. రామమందిరం వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో మర్గం మధ్యలో మార్వాడీ సమాజ్ ప్రతినిధులు భక్తులకు తాగునీరు, మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. ప్రత్యేక పూజలతో పాటు భజనా కార్యక్రమం చేపట్టారు.

పర్లాకిమిడి: పట్టణంలోని రామాలయంలో స్వామివారి దర్శనం కోసం భక్తుల తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. ప్రధానార్చకులు ఎ.ఉగ్రనర్సింహాచారి, రాజగోపాలాచారి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. సింకివీధి, కంద్రవీధిలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఉపకారాగారం వద్ద ఉన్న ఆంజనేయస్వామి మందిరంలో అన్నదానం నిర్వహించారు. కాశీనగర్ సమితి హడ్డుబంగి గ్రామంలో 130 ఏళ్ల పురాతనమైన కోదండ రామాలయంలో బల్ల మురళీ, బల్ల విఠల్ దంపతులు స్వామివారి కల్యాణం చేపట్టారు. అలాగే రామాలయం కమిటీ సభ్యులు పోకూరీ బాబూరావు, ఎన్ని రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం జరిపారు.

- పర్లాకిమిడి సరస్వతీ శిశుమందిర్ నుంచి భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో శోభాయాత్ర జరిపారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు కైలాష్‌చంద్ర గౌడో, ప్రతినిధులు మహంత రామానంద్ దాస్, హరిమోహన్ పట్నాయక్, భజరంగ్ దళ్ జిల్లా కో–ఆర్డినేటర్ లోక్‌నాథ్ మిశ్రా, కార్యదర్శి మనోజ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు



సైకత శుభాకాంక్షలు

భువనేశ్వర్: శ్రీరామ నవమి సందర్భంగా పూరీ సాగర తీరంలో ప్రముఖ సైకత కళాకారుడు పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ శ్రీరాముని ప్రతిరూపంతో అయోధ్యలోని రామమందిరం సూక్ష్మ రూపాన్ని ఈ శిల్పంలో రూపొందించారు. నవమి శుభాకాంక్షలతో ఈ శిల్పం రూపుదిద్దుకుంది. అలాగే రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్, సీఎం క నవీన్ పట్నాయక్ ప్రజలకు రామనవమి శుభాకాంక్షలు తెలిపారు.



జయపురం: పల్లకిలో సీతారామ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం



బరంపురం: గోల్లపల్లిలో రామనామ స్మరణలో భక్తురాలు



జయపురం: ఖడ్గాలు చేతపట్టి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



జయపురం: ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



రాయగడ: శ్రీరామ కీర్తనలతో భారీ ర్యాలీ



రాయగడ: కోదండరామ మందిరంలో భక్తుల తాకిడి



మల్కన్‌గిరి: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు



పర్లాకిమిడి: హడ్డుబంగిలో సీతారాముల కల్యాణ దృశ్యం



పర్లాకిమిడి: శోభాయాత్ర నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ ప్రతినిధులు



పర్లాకిమిడి: ర్యాలీలో పాల్గొన్న భక్తులు



మల్కన్‌గిరి: చిత్రంగపల్లి గ్రామంలో నవమి వేడుకలు

మహావిశుభ ఉత్సవాలకు ముహూర్తపు రాట

రాయగడ:

పట్టణంలోని హొటల్ తేజస్విని మైదానంలో ఏప్రిల్ 14న జరగనున్న మహావిశుభ మిలన్(పానా సంక్రాంతి) ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు కమిటీ కన్వీనర్ రాయిసింగి బిడిక ఆధ్వర్యంలో ముహూర్తపు రాట కార్యక్రమం గురువారం నిర్వహించారు. మాజీమంత్రి లాల్‌బిహారి హిమిరిక, సత్యవాది పతి, వినాయక్ కర్, అమియ స్వొయి, తిరుపతి బనఘాటి, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పానా సంక్రాంతి వేడుకలను సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రాయిసింగి తెలిపారు. గత 11ఏళ్లుగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

రెండు వేదికల్లో వేడుకలు..!

ఒడియా ప్రజల కొత్త సంవత్సరాది విశుభ సంక్రాంతి(పానా) ఈ ఏడాది పట్టణంలో 2వేదికలపై జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒడియా ప్రజలంతా కలసి కట్టుగా ఒకే వేదికపై ఈ ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తుండేవారు. అయితే గత కొద్ది రోజుల క్రితం స్థానిక జగన్నాథ మందిరంలో జరిగిన ప్రత్యేక సమావేశానికి విశుభ సంక్రాంతి ఉత్సవ కమిటీకి చెందిన ప్రముఖ న్యాయవాది మదన్‌మోహన్ పాఢి, సునీల్‌చంద్ర పండ, సత్యవాది పతి, రాయగడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శుభ్రాపండా, కౌన్సిలర్ మంజుల మినియాక, గోవింద రథో తదితర ప్రముఖులు సమావేశమయ్యారు. ఏటా ఉత్సవాలకు కన్వీనర్‌గా వ్యవహరించే మజ్జిగౌరి మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక ఆలస్యంగా హాజరయ్యారు. అప్పటికే పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటు చేశామని కొంతమంది సభ్యులు సమావేశంలో ప్రకటించారు. తనకు తెలియకుండా, అభిప్రాయం తెలుసుకోకుండా కొత్త కమిటీని ఎలా ఏర్పాటు చేశారని ఆయన ప్రశ్నించారు. ఈ క్రమంలో పానా సంక్రాంతి వేడుకను నిర్వహించేందుకు స్థానిక రాణిగుడ ఫారంలో రాయిసింగ్ వేరుగా మరో సమావేశం నిర్వహించారు. పలువురు కౌన్సిలర్లు, న్యాయవాది వినాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయగడలోని హొటల్ తేజస్విని ఎదురుగా ఉన్న మైదానంలో పానా సంక్రాంతి ఉత్సావాలను నిర్వహించేందుకు తీర్మానించినట్లు సమాచారం. దీంతో ఇప్పటి వరకు ఒకే వేదికపై జరిగిన ఉత్సవాలు రెండు వేదికలపై జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.



ముహూర్తపు రాటను వేస్తున్న బిడిక, హిమిరిక



జగన్నాథ మందిరంలో జరిగిన సన్నాహక సమావేశం

కన్నీటి కథ



కేన్సర్ వ్యాధితో మంచాన పడిన మహాలక్ష్మి

- కేన్సర్ బారిన పడిన మహిళ
- వైద్యానికి సరిపోని ఆర్థిక స్థోమత
- కొడుకు కూడా దివ్యాంగుడు
- సాయం కోసం ఎదురుచూపు

వజ్రపుకొత్తూరు రూరల్:

కొడుకు దివ్యాంగుడు. మాటలు రావు, వినిపించవు. భార్య గొంతు క్యాన్సర్ బాధితురాలు. ఏడు నెలల కాలంగా మంచానికే పరిమితమయ్యారు. రోజూ కూలి పనికి వెళ్తే గానీ రోజు గడవని ఆర్థిక స్థితి ఆయనది. పనికి వెళ్లకపోతే కడుపు నిండదు. వెళ్తే భార్యాకొడుకులను చూసుకునే వీలుండదు. ఆరు నెలల పాటు ఆరోగ్యశ్రీపై భార్యకు చికిత్స అందజేసినా ఇంకా వైద్యం చేయాల్సి ఉండడంతో ఆ ఇంటి యజమాని చితికిపోతున్నాడు. ఎంత కష్టపడుతున్నా వస్తున్న సంపాదన సరిపోవడం లేదని.. ఈ కష్టకాలంలో దాతలు సాయం చేస్తే తన కుటుంబాన్ని బతికించుకుంటానని కోరుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

వజ్రపుకొత్తూరు మండలం బెండి గ్రామానికి చెందిన అల్లాడ జనార్ధన, మహాలక్ష్మి దంపతులు రోజు వారి కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అతను పుట్టుకతోనే దివ్యాంగుడు. చిన్నప్పుడు రూ. లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించినా ఫలితం కనిపించలేదు. అతనికి మాటలు రావు, వినిపించదు కూడా. దివ్యాంగుడే అయినా పింఛన్‌కు నోచుకోలేదు. తల్లిదండ్రుల రెక్కల కష్టంతోనే ఆ కుటుంబం కడుపు నిండుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏడు నెలల కిందట మహాలక్ష్మి అనారోగ్యానికి గురయ్యారు. ఆస్పత్రులన్నీ తిప్పితే గొంతు క్యాన్సర్ అని తెలిసింది. దీంతో జనార్దన గుండెల్లో రాయి పడింది. ఆస్పత్రుల చుట్టూ తిరిగే సరికి రూ.2.5 లక్షలు ఖర్చైపోయింది. కూలి పనులు చేసుకునే వీరికి ఇది చాలా పెద్ద మొత్తం. తర్వాత ఆరోగ్య శ్రీ ద్వారా విశాఖలో మహాలక్ష్మికి కీమోథెరపీ చేశారు. ఇప్పుడు ఇంటికి వచ్చారు. కానీ ఇంకా చికిత్స చేయాల్సి ఉండడం, చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో జనార్దన సాయం కోరుతున్నారు. ప్రతి రోజూ కూలి పనికి వెళ్లి సరైన వైద్యం చేయించలేనని, మనసున్న వారు తమను ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.



ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబం

సాయం చేయాలనుకునే వారు 90101 31531 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నా భార్యకు ప్రాణభిక్ష పెట్టండి



మేం కూలి పనులు చేసుకుంటూ బతికే వాళ్లం. నా కుమారుడు దివ్యాంగుడు. ఇప్పుడు నా భార్య గొంతు క్యాన్సర్‌తో బాధపడుతోంది. వైద్యం కోసం రూ.లక్షల్లో ఖర్చు పెట్టాను. ఇప్పుడు ఇంకా వైద్యం చేయించే స్థోమత నాకు లేదు. దాతలే ఆదుకోవాలి.

– అల్లాడ జనార్ధన

క్రీడలతో ఉద్యోగ అవకాశాలు: ఎస్పీ

పలాస: యువత, క్రీడాకారులు నేరాల వైపు వెళ్లవద్దని, ఒక్కసారి తప్పు చేస్తే జీవితంలో దాన్ని సరిదిద్దుకోలేరని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. పలాస మండలంలోని బొడ్డపాడు గ్రామంలో కాశీబుగ్గ పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించేందుకు క్రీడలు దోహద పడతాయన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వాలు మనకు కల్పించాయన్నారు. క్రీడాకారులు గెలుపు ఓట ములను తేలిగ్గా తీసుకోవాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న క్రీడాకారులందరూ గ్రామస్థాయి నుంచి వచ్చిన వారేనని గుర్తు చేశారు. గ్రామాల్లో నేరాలు జరిగే సమయంలో జరిగిన సంఘటనలను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లాలో బొడ్డపాడు ప్రాంతానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, ఇలాంటి ప్రాంతాలకు పోలీసులు సైతం వచ్చేందుకు భయపడేవారని, అలాంటి ప్రాంతంలో క్రీడా పోటీలు నిర్వహించడం, అందుకు స్థానిక సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు, యువత సహాయ సహకారాలు అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముందుగా ఎస్పీ రాధికకు కాశీబుగ్గ డీఎస్పీ శివరాంరెడ్డి, కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసులు, సర్పంచ్ తామడ మదన్, ఎంపీటీపీ ఎం.పాపారావు, యాంకర్ శ్రీనివాస బాబ్జి, సరోజవర్మ, పీఈటీలు పోలీసు ఉన్నతాధికారులు క్రీడాకారులు బొడ్డపాడు గ్రామ యువత పాల్గొన్నారు.

విజేతల వివరాలు

మండలంలోని బొడ్డపాడు గ్రామంలో కాశీబుగ్గ పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు రసవత్తరంగా సాగాయి. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో మందస మండలం భేతాళపురం ప్రథమస్థానం, వజ్రపుకొత్తూరు మండలం సైనూరు ద్వితీయ స్థానం, మూడోస్థానంలో పల్లిసారధి, బాతుపురం, నిలిచాయి. క్రికెట్ విభాగంలో ప్రథమ స్థానంలో పలాస మండలం మాకన్నపల్లి, ద్వితీయస్థానం బొడ్డపాడు టీమ్‌లు నిలిచాయి. బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో ప్రథమస్థానంలో సానివాడ, రెండోస్థానంలో ఎచ్చెర్ల, మూడోస్థానంలో పలాస మండలం బ్రాహ్మణతర్లా, బాలుర విభాగంలో మొదటిస్థానంలో కాశీబుగ్గ, రెండోస్థానంలో ఎచ్చెర్ల, మూడోస్థానంలో టెక్కలి నిలిచాయి. గెలుపొందిన విజేతలకు ఎస్పీ రాధిక చేతుల మీదుగా నగదుతో పాటు జ్ఞాపికలు అందజేశారు.



నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా
పుయింతోల టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్
SAFEWAY
రిజిష్టర్డ్ ఆఫీసు: Level1 (CE Serviced Offices), Building-10, Tower-A, Cyber Hub, DLF-II, Gurgaon, Haryana - 122002

బహిరంగ ప్రకటన
తేది: 01. ఏప్రిల్, 2023 నుండి వారపాటు టోల్ ప్లాజా వద్ద వర్తించు సవరించిన టోల్ రుసుము వివరములు

[illegible] తేది:26-04-2018 [illegible] S.O.No.3884 (E) తేది: 16-08-2018 MoRT&H [illegible] 27-03-2023 నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) [illegible] తేది. 1-4-2023 [illegible] 482+525 [illegible]

వాహనం రకం	FASTag యూజర్స్‌కి వర్తించును			
	ఒకవైపు ప్రయాణం రుసుము (రూ.)	24 గంటలలో తిరుగు ప్రయాణం రుసుము (రూ.)	ఒక నెలలో 50 సింగిల్ ప్రయాణముల కొరకు నెలసరి ప్రయాణం రుసుము (రూ.)	[illegible]
[illegible]	110	165	3700	55
[illegible]	180	270	5975	90
[illegible]	375	565	12515	190
[illegible]	410	615	13655	205
భారీ నిర్మాణ యంత్రాలు (HCM)/ ఎర్త్ మూవింగ్ పరికరాలు (EME) మల్టీ యాక్సిల్ వాహనాలు (MAV) (4 నుండి 6 యాక్సిల్స్)	590	885	19630	295
[illegible]	715	1075	23895	360

టోల్‌ప్లాజా నుండి 20 కి.మీ దూరంలోపు [illegible] రూ. 330/- [illegible]

గమనిక: [illegible] FASTag [illegible] 2 రెట్లు [illegible]
1. [illegible] 77.579 కి.మీ [illegible]
2. పై టోల్‌ప్లాజా [illegible] (FASTag యూజర్స్‌కి మాత్రమే వర్తించును):
ఎ. [illegible] 24 గం.లలో తిరుగు ప్రయాణం (తగ్గింపు 25%)
బి. [illegible] 50 [illegible] సింగిల్ ప్రయాణాలు (తగ్గింపు 33%)
సి. టోల్‌ప్లాజా నుండి 20 కి.మీ.ల పరిధిలో [illegible] పాస్ (రూ.330/-)
డి. [illegible] (50% తగ్గింపు)
3. [illegible] GSR 838 (E) [illegible] 05-12-2008 [illegible]
4. [illegible] 10 రెట్లు [illegible]
5. [illegible] 26-04-2018 [illegible] 29-08-2048 19:59 [illegible]
6. తేది: 29-06-2018 [illegible] http://www.nhai.gov.in వెబ్‌సైట్ ను సంప్రదించగలరు.
7. [illegible]

	గుత్తా పట్టాదారు	ఇండిపెండెంట్ ఇంజనీర్	PIU of NHAI
ప్రతినిధి పేరు	శ్రీ యస్. [illegible] ప్రాజెక్ట్ మేనేజర్	శ్రీ [illegible] రెసిడెంట్ ఇంజనీర్	శ్రీ [illegible] ప్రాజెక్ట్ డైరెక్టర్
చిరునామా	[illegible] 533 107.	[illegible] 760005	నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా [illegible] ప్లాట్ నెం. 1187 [illegible] 760 005
ఫోన్ నెం.	0883-2411022	9937012167	0680-2951293

క్లుప్తంగా

నేడు వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ పర్యటన

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ మార్క్‌ఫెడ్ ఎం.డి రాహుల్ పాండే శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ శాఖ సహాయ సంచాలకులు వై.వి.శ్యామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పలు మార్కెట్ యార్డులు, రైతు భరోసా కేంద్రాలు, రైతు బజార్‌లను సందర్శిస్తారని తెలిపారు. జిల్లా కేంద్రంలో మార్కెటింగ్ శాఖ కార్యకలపాలపై సమీక్షస్తారన్నారు. తొలుత విజయనగరం మార్కెట్ యార్డులను సందర్శించి అనంతరం అక్కడ మార్కెటింగ్ శాఖ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. తర్వాత ఆర్అండ్‌బీ రైతు బజార్‌ను సందర్శిస్తారని తెలిపారు. నెల్లిమర్ల మండలం గుషిణిలోని ఎం.పి. ఎఫ్.సి గొదాంను సందర్శిస్తారని పేర్కొన్నారు. భోగాపురంలో వేత్రిడ్జిని, పూసపాటిరేగ మండలం కొప్పెర్లలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శిస్తారని, తర్వాత విశాఖపట్నం వెళ్తారని తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న ఈఈ

బొబ్బిలి: పట్టణంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనులను ప్రజారోగ్య శాఖ ఈఈ దక్షిణామూర్తి గురువారం పరిశీలించారు. ప్రస్తుతం తాగునీటి పైప్‌లైన్లు అమర్చుతున్నందున ఆ పనులకు అవసరమైన సూచనలు చేశారు. భవిష్యత్తులో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పనులు చేయాలని సిబ్బందికి సూచించారు.

టన్ను బెల్లం రూ.42వేలు

- మార్కెట్‌లో పెరిగిన బెల్లం ధర



బెల్లం చెక్కీలు

రాజాం: బెల్లంకు మార్కెట్ పెరిగింది. నియోజకవర్గంలో వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో ఎక్కువగా బెల్లం తయారీ గానుగలు ఉన్నాయి. ఇక్కడ తయారీ చేసే బెల్లంకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో రాజాం మార్కెట్‌లో ఎక్కువ విక్రయాలు జరుగుతుంటాయి. సేంద్రియ విధానంలో బెల్లాన్ని తయారీ చేస్తుంటారు. పండుగ సమయంలో టన్ను బెల్లం ధర రూ.40 వేలు ఉండగా, ఇటీవల రూ.2 వేలు అదనంగా పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ బెల్లానికి టన్ను రూ.42 వేలు పలుకుతుంది. సంతకవిటి మండలం జావాం, హొంజరాం, రేగిడి మండలంలో ఖండ్యాం ప్రాంతాల బెల్లానికి ఇంతకంటే ఎక్కువ ధర స్థానికంగానే లభిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దీంతో రైతులు సంబర పడుతున్నారు.

5న 'చలో ఢిల్లీ'



చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రాజాం సిటీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందితో గురువారం సమావేశమై, చలో ఢిల్లీ కార్యక్రమ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ధనికుల సేవలో తరిస్తోందని విమర్శించారు. మోదీ కార్మిక చట్టాల్లో మార్పులు చేసి, లేబర్ కోడ్‌లను వారి సంఖ్యాబలంతో పార్లమెంట్‌లో పాస్ చేసిందని దుయ్యబట్టారు. కార్మికులకు న్యాయమైన హక్కులు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉద్యమించకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవన్నారు. కార్యక్రమంలో రాజేష్, కృష్ణ, కనకరాజు, గిరి, చినబాబు, అచ్యుతరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: సీతానగరం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఆర్. సతీష్‌కుమార్ కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలిలా ఉన్నాయి. కొద్ది కాలంగా కడుపునొప్పి కోసం మందులు వాడుతున్నప్పటికీ తగ్గకపోవడంతో మనస్తాపానికి గురైన సతీష్ కుమార్ పొలానికి వాడగా ఇంట్లో మిగిలిన గడ్డిమందు తాగాడు. ఈ విషయాన్ని తల్లి గమనించి స్థానికులకు తెలియజేయగా ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పురుగు మందు తాగి మరొకరు..

పార్వతీపురం మండలం సంగంవలసకు చెందిన టి.అప్పలస్వామి మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అప్పలస్వామి ఆరోగ్యం ఎప్పటికీ కుదుటపడకపోడంతో మనస్తాపానికి గురై పురుగు మందుతాగేశాడు.

కల్యాణం.. కమనీయం...

రామతీర్థం భక్త జన సంద్రంగా మారింది. ఆలయ ప్రాంగణంతో పాటు కల్యాణ వేదిక ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగింది.

- వైభవంగా శ్రీసీతారాముల పరిణయం
- కనులారా వీక్షించి పులకించిన భక్త జనం
- జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన రామతీర్థం
- పట్టు వస్త్రాలను సమర్పించిన మంత్రి బొత్స దంపతులు



కల్యాణ మహోత్సవంలో భాగంగా ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు





కల్యాణాన్ని తిలకిస్తున్న మంత్రి బొత్స కుటుంబ సభ్యులు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులు

నెల్లిమర్ల రూరల్: భక్తుల జయజయ ధ్వానాలు.. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దశరథ పుత్రుడు శ్రీరామచంద్రస్వామి వారి కల్యాణ తంతు కొనసాగింది. సరిగ్గా 12గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామివారు సీతమ్మ తల్లి మెడలో మాంగల్య ధారణ చేశారు. స్వామివారి కల్యాణాన్ని అశేష భక్త జనులు కనులారా వీక్షించి తరించారు.

ఊరేగింపుగా పెళ్లికి పయనం

శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 3గంటలకు ఆరాధన, బాలభోగం, సేవాకాలం కార్యక్రమాలను నిర్వహించారు. 6గంటలకు యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. ఆలయంలో ఉన్న ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాలు, భక్త జన సందోహం నడుమ కల్యాణ మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. మండపంలోని మధ్య భాగంలో అమ్మవారిని, స్వామివారిని వేంచేయింపజేశారు. మండపంలో ఆశీనులైన శ్రీ సీతారాముల వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం

శ్రీరామచంద్ర ప్రభువుకు ఏకాంతంగా అవతార సర్గ విన్నపం నిర్వహించారు. అనంతరం శ్రీసీతారామ లక్ష్మణులకు అత్యంత వైభవంగా పాలు, పెరుగు, నెయ్యి, తేనె, ఫల రసాలు, సముద్ర నదీ జలాలతో అభిషేకాన్ని జరిపించారు. అర్చక స్వాములు ప్రతీ తంతుకు వేదమంత్రాన్ని పఠిస్తూ కల్యాణాన్ని కొనసాగించారు. కల్యాణ తంతులో భాగంగా స్వామివారికి 'కన్యావరణ' 'యజ్ఞోపవీతదారణం' జరిపించారు. వధూవరుల వంశ గోత్ర నామాలను ప్రవచించారు. ఆశీర్వచనం, పాద ప్రక్షాళణం, పుష్పోదక స్నానం నిర్వహించి వరపూజ చేశారు. అనంతరం స్వామివార్లకు నూతన వస్త్రాలంకరణ చేశారు.

జీలకర్ర – బెల్లం

వేద పండితుల వేద మంత్రోచ్చారణ చేస్తూ సరిగ్గా 12గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారామస్వామి శిరస్సుపై ఉంచారు. అనంతరం అర్చకస్వాములు మంత్రాలను జపిస్తూ శాస్త్రోక్తంగా సాక్షాత్తు సీతమ్మ తల్లి మంగళ సూత్రాలను భక్త జనులకు చూపించి మాంగళ్యధారణ గావించారు. తరువాత ముత్యాల తలంబ్రాల వేడుకను కనుల పండువగా సాగించారు. భక్తులు సమర్పించిన పవిత్ర గోటి తలంబ్రాలతో తలంబ్రాల వేడుక సాగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అశేషంగా తరలివచ్చిన భక్తుల రామనామ స్మరణతో కల్యాణ ప్రాంగణం మార్మోగింది. కల్యాణం అనంతరం స్వామివారి తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను తీసుకొని భక్తులు తిరిగి పయనమయ్యారు.



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి -దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

సేవలు బేష్

రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో రామతీర్థంలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవం విజయవంతంగా ముగిసింది. నవమి వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు సేవలతో కూడిన పహారా నిర్వహించారు. సతివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శ్రీవారి సేవా భక్తులు తమ సేవలు అందించారు. దేవస్థానం తరపున భక్తులకు అన్న ప్రసాద వితరణ, మజ్జిగ, మంచినీరు అందజేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శ్రీరామనవమి వేడుకలను విజయవంతం చేశారు.



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు



పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుటుంబ సభ్యులు



స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి బొత్స దంపతులు



స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న మంత్రి బొత్స కుటుంబ సభ్యులు

రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులు వేడుకలకు హాజరై సింహాచలం దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను స్వామివారికి సమర్పించారు. తొలుత ఆలయంలో సీతారాములను దర్శించుకున్న అనంతరం కల్యాణ వేదిక వద్దకు చేరుకొని అర్చకులకు పట్టు వస్త్రాలు అందజేశారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి తదితరులు కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణవేదిక వద్ద వేంచేసి ఉన్న సీతారాములను దర్శించి కల్యాణాన్ని తిలకించారు. ఏపీ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి స్వామిని దర్శించుకున్నారు. కల్యాణం జరుగుతున్నంత సేపు మైలవరపు శ్రీనివాసరావు ప్రత్యక్ష వ్యాఖ్యాతగా స్వామివారి కల్యాణ గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత నృత్య కార్యక్రమం భక్తులను ఎంతగానో అలరించింది. కల్యాణోత్సవంలో జేసీ అశోక్, ఆర్డీఓ సూర్యకళ, ఈఓలు కిషోర్‌కుమార్, ప్రసాదరావు సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ గదల బంగారమ్మ, నగర పంచాయతీ చైర్మన్ సరోజిని, జెడ్పీ చైర్మన్ తనయుడు మోహిత్, ఎంపీ, ఎమ్మెల్యే తనయులు బడ్డుకొండ మణిదీప్, ప్రదీప్, వంశీ, నేతలు మత్స సత్యన్నారాయణ, రేగాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

జన జీవనశైలిలో క్రమేణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఆహార పదార్థాల అలవాట్లలో పాత తరం వారి అలవాట్లను పాటిస్తున్నారు. చిరుధాన్యాలను తమ ఆహారపు అలవాట్లలో జత చేస్తున్నారు. దీంతో ఆరోగ్యమే మహాభాగ్యమని భావిస్తున్నారు.

- మారుతున్న మానవుని జీవనశైలి
- చిరుధాన్యాల ఆహార పదార్థాలపై జనం ఆసక్తి
- జిల్లాలో 4500 హెక్టార్లలో సాగు
- బిస్కెట్లకు మార్కెట్‌లో భలే గిరాకి



రాగి లడ్డూలు



రాగి బిస్కట్లు



కొర్ర పులిహోర

విజయనగరం ఫోర్ట్: ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పు వస్తుంది. ఫాస్ట్‌ఫుడ్స్, జంక్ ఫుడ్స్ వంటి వాటికి క్రమేణ స్వస్తి పలుకుతున్నారు. ఇప్పుడిప్పుడే అధికశాతం మంది పూర్వీకులు తినే చిరుధాన్యాల ఆహారం పట్ల ఆసక్తి చూపుతున్నారు. కొందరు ఇంట్లోనే పిండి వంటలు వండించుకుని తింటున్నారు. కరోనాకు భయపడి చాలా మంది ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు. చిరుధాన్యాల పట్ల ఎక్కువ మంది ఆశక్తి చూపుతున్నారు. చిరు ధాన్యాలను కొందరు ఆహారంగా తీసుకుంటుంటుగా కొందరు చిరుధాన్యాలతో తయారు చేసిన బిస్కెట్లు, చాక్లెట్లు, చపాతి, మురుకులు, ఇడ్లీ, రాగి జావ వంటి వాటిని ఎక్కువగా తింటున్నారు.

చిరుధాన్యాలలో లభించే పోషక విలువలు (ప్రతి 100 గ్రాములకు)	
మాంసకృత్తులు	14.63 గ్రాములు
పిండి పదార్థాలు	69.6 గ్రాములు
కొవ్వు	5.18 గ్రాములు
శక్తి	384 కేలరీలు
కాల్షియం	340 మిల్లీగ్రాములు
ఇనుము	5.37 గ్రాములు
పీచు పదార్థం	2.58 గ్రాములు
పాస్పరస్	310 మిల్లీ గ్రాములు
పొటాషియం	570 మిల్లీ గ్రాములు
జింక్	2.46 గ్రాములు
ఖనిజాలు	1.8 గ్రాములు
తేమ	8.79 గ్రాములు

పెరిగిన ప్రాధాన్యం

మనిషికి హిమోగ్లోబిన్ 15 మి.గ్రా ఉంటే వ్యాధి నిరోధక శక్తి బాగుంటుందని వైద్యులు సూచిస్తున్నారు. అన్నిటికంటే చోడి శరీరానికి అవసరమైన పోషక పదార్థాలను, ఎముకలకు కాల్షియాన్ని అందిస్తుంది. దీంతో రాగికి బెల్లం జత చేసిన ఆహార పదార్థాలు ఇప్పుడు ఇళ్లలో కనిపిస్తున్నాయి. రాగితో బరువు పెరగడంతో పాటు చక్కెరను నియంత్రిస్తుంది. పేగుల్లో ఆహారాన్ని వేగంగా శోషించకుండా చేస్తుంది. దీంతో గ్లూకోజ్ స్థాయి అనుకూలంగా మారుతుంది. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు రాగిలో ఉండే ఇనుప ధాతువు వల్ల రక్తహీతన సమస్య ఏర్పడదు. ఇక రక్తహీనత, రక్తపోటు, కాలేయ సంబంధిత వ్యాధులు, అవాంచిత వృద్ధాప్యం వంటివి దరి చేరవు. దీంతో పాటు ప్రజలు జొన్నలు, సజ్జలు, కొర్ర, సామలను కూడా తింటున్నారు.

బహుళ ప్రయోజనాలు



చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు తినడం వల్ల శరీరానికి ఎక్కువ ఇనుము లభ్యమవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రక్తహీనత ఉన్న మహిళలు, గర్భిణులు ఎక్కువగా చిరుధాన్యాల ఆహార పదార్థాలు తీసుకుంటే మంచిది. చిరుధాన్యాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. ఇవి తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చు. బయట ఆహార పదార్థాలు కంటే ఇంట్లో వండే పిండి వంటలు తినడం చాలా మంచిది.

– డాక్టర్ బి.పద్మావతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

బెల్లంతో చేసిన తిను బండారాలకు ప్రాధాన్యత

బెల్లంతో చేసిన తినుబండారాలను ఇప్పుడు ఎక్కువగా తింటున్నారు. ముఖ్యంగా నూనె తక్కువగా ఉండే వాటిని భుజిస్తున్నారు. బెల్లం పాకంతో వేరుశనగ ఉండలు, నువ్వు ఉండలు, రాగి లడ్డు, మినప లడ్డు, రాగి సక్కు వంటి వాటిని ఎక్కువగా జనం తింటున్నారు.

ఇష్టంగా తింటున్నారు...

చోడి, కొర్ర, సజ్జ వంటి వాటితో తయారు చేసిన బిస్కెట్లు, లడ్డూలు, మురుకులు రుచికరంగా ఉండడంతో చిన్న పిల్లలు సైతం ఇష్టంగా తింటున్నారు. పోషక విలువలు అధికంగా ఉండడంతో పెద్దలు కూడా వీటిని ఇష్టంగా తింటున్నారు.

రామయ్య సేవలో...



రామతీర్థం చేరుకున్న ప్రకాశరావు

విజయనగరం ఫూల్‌బాగ్: ఒంటిపై కాషాయ చొక్కా... చేతిలో రామకోటి ప్రతులు... తోడుగా ఓ పాత సైకిల్... గుండెల నిండా అసమాన భక్తి వెరసి లంక ప్రకాశరావు. ఇంటిపేరు లంక అయినా ప్రకాశరావు మనసంతా అయోధ్యే. సోంపేట మండలం పాత్రఖండ గ్రామానికి చెందిన 57 ఏళ్ల ఈ రామభక్తుడు పాతికేళ్లుగా సైకిల్‌పై విరామం ఎరగకుండా ప్రయాణం చేస్తున్నారు. అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం నుంచి భద్రాచలం వరకూ వెళ్లాలన్నా.. సైకిల్‌పై రయ్‌మంటూ దూసుకెళ్లిపోవటమే ఆయనకు తెలిసింది. అవివాహితుడైన ప్రకాశరావుకు కుటుంబం అంటూ ఏమీలేదు. రాముడిపై భక్తితో దాదాపు రెండు దశాబ్దాలుగా రామకోటి ప్రతులను భద్రాచలం వరకు చేరుస్తుంటారు. నిత్యం సైకిల్‌పై తిరిగే ప్రకాశరావు ముఖ్యమైన పండగల సమయంలో రాముని కోసం ఆయా ఆలయాలకు వచ్చిన భక్తులకు ప్రచారం చేస్తుంటారు. అందులో భాగంగా శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రకాశరావు గురువారం రామతీర్థం చేరుకున్నారు.

లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ



చికిత్స పొందుతున్న పోలినాయుడు

భోగాపురం: ఓ లారీ అదుపుతప్పి వేరే లారీని ఢీకొనడంతో డ్రైవర్ షేక్ నసీజ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. భోగాపురం జాతీయ రహదారిపై గురువారం ఈ ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వేకువజామున మూడుగంటల ప్రాంతంలో విశాఖపట్నం నుంచి డ్రమ్ముల లోడుతో శ్రీకాకుళం వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో అదుపుతప్పి డివైడర్‌ను దాటుకుని శ్రీకాకుళం నుంచి ఐరన్ లోడుతో విశాఖపట్నం వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న లారీ డ్రైవర్ తీవ్రగాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి...

పార్వతీపురం: ట్రాక్టర్ ఢీకొనడంతో మక్కువ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన ఎల్. పోలినాయుడు గాయాలపాలయ్యాడు. గురువారం ఉదయం స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై పోలినాయుడు పార్వతీపురం వస్తుండగా వెంకంపేట గోరీలవద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో పోలినాయుడి కుడి కాలు, ఇతర భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్రలు మీద పడి లారీ డ్రైవర్ మృతి



కర్రల కింద ఇరుక్కుని మృతి చెందిన డ్రైవర్ శ్రీరాములు (ఇన్‌సెట్లో) శ్రీరాములు (ఫైల్)

బొండపల్లి: విజయనగరం నుంచి ఒడిశాలోని రాయగడకు కర్రల లారీతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తాపడడంతో లారీలోని కర్రలు మీద పడి ఊపిరాడక డ్రైవర్ మృతి చెందాడు. గురువారం వేకువజామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెరకముడిదాం మండలం ఊటపల్లి గ్రామానికి చెందిన రెడ్డి శ్రీరాములు(55) బతుకుతెరువు నిమిత్తం రాయగడ వెళ్లి కొన్ని సంవత్సరాలుగా భార్యాబిడ్డలతో అక్కడే నివాస ఉంటూ లారీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విజయనగరం నుంచి సరుగుడు కర్రల లోడుతో వస్తుండగా బోడసింగిపేట గ్రామానికి సమీపంలోని సాయిసిద్ధార్థ కాలేజీని అనుకుని జాతీయ రహదారి26పై లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌పై కర్రలు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. కర్రల కింద ఇరుక్కుపోయిన మృతదేహన్ని రెండు గంటల పాటు శ్రమించి పోలీసులు బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

గజపతినగరం: గజపతినగరం పోలీస్ స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో పులి కొండ (53) అనే సాధువు మృతి చెందాడు. గురువారం ఉదయం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా జొన్నగుడ్డి ప్రాంతానికి చెందిన పులి కొండ గజపతినగరం మండలం పురిటిపెంట మామిడి బంద కాలనీలో ఉన్న సోదరి చిన్నమ్మలు ఇంటికి 10ఏళ్ల క్రితం వచ్చేశాడు. అప్పటినుంచి సోదరి ఇంటివద్దనే ఉంటూ నిత్యం భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గురువారం ఉదయం శ్రీరామ నవమి సందర్భంగా పురిటిపెంట మండల వారి కాలనీలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్తుండగా జాతీయ రహదారి వద్ద పోలీస్‌స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పులి కొండ

కేన్సర్ బాధిత చిన్నారికి ఆర్థిక సాయం

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారి లండ యుగంధర్ కేన్సర్‌తో బాధ పడుతున్న సంగతి తెలిసిందే. చిన్నారి పరిస్థితిపై 'సాక్షి'లో కథనం కూడా ప్రచురితమైంది. కవిటి మండలం భైరిపురం గ్రామానికి చెందిన రేస్ ఫౌండేషన్ చైర్మన్ పుల్లట ప్రవీణ్ బాధిత బాలుడి కుటుంబానికి తన వంతుగా రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు.

చిన్నారికి మెరుగైన వైద్యం అందించడం కోసం హైదరాబాద్‌లోని ప్రముఖ క్యాన్సర్ ఆస్పత్రిని సంప్రదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గొనప రవి,బిసాయి రవి, బల్లెడ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సిక్కోలు ఉద్దానం సేవా సమితి సాయం..

పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధిత చిన్నారి లండ యోగేంద్ర వైద్యం కోసం సిక్కోలు ఉద్దానం సేవా సమితి వారు రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కామేష్‌రెడ్డి, కామేష్, హరి, వేణు, అనిల్, శరత్ రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జింకపై కుక్కల దాడి

పాతపట్నం: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద కుక్కలు చుక్కల జింకపై దాడి చేసి చంపేశాయి. జోగికొండ నుంచి గురువారం ఉదయం నీటి కోసం జింక కిందకు రావడంతో కుక్కలు చూసి వెంబడించి దాడి చేశాయి. స్థానికులు దీన్ని చూసి కుక్కలను తరిమి జింకకు తమ వద్ద రక్షణ కల్పించారు. అటవీ శాఖకు సమాచారం అందించడంతో వారు వచ్చి తమ కార్యాలయానికి తీసుకెళ్లారు. అయితే కాసేపటి కే జింక చనిపోయింది. కుక్కల దాడిలో జింక లు చనిపోవడం ఈ మధ్య పెరిగిపోతోంది. గురువారం ఉదయమే ఫారెస్ట్‌లో వాటర్ టబ్బులను ఏర్పాటు చేశారు. అయినా జింక కిందకు రావడంతో కుక్కల దాడిలో మృతిచెందింది.